E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 12-08-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



టెన్త్ పరీక్షలపై సర్కార్ యూ టర్న్ » 3లో

తెలంగాణలో ఐదు రోజులపాటు భారీ వర్షాలు » 3లో



డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఠాకూర్ క్లారిటీ » 5లో



కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం » 4లో



బుమ్రా అన్ని మ్యాచ్‌లూ ఆడి ఉంటే.. టీమ్‌ఇండియా తప్పకుండా సిరీస్ గెలిచేది: వెంగ్‌సర్కార్ » 6లో



# ఓట్ల చోరీపై పోరుబాట

- ఢిల్లీలో 'ఇండియా' కూటమి ఎంపీల నిరసన ర్యాలీ
- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి బయలుదేరిన విపక్ష నేతలు
- ర్యాలీకి అనుమతి లేదంటూ మధ్యలోనే అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు



ఈ కబురు,న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) తోపాటు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో అక్రమాలు, ఓట్ల చోరీ, గత లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్‌పై విపక్ష 'ఇండియా' కూటమి పోరుబాట పట్టింది. ఓట్ల చోరీని వెంటనే ఆపాలని, 'ఒక్కరికి ఒక ఓటు' అనే విధానాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలు సోమవారం దేశ రాజధానిలో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తెల్లటోపీలు ధరించి పార్లమెంట్ మకరద్వారం నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయలుదేరిన 'ఇండియా' కూటమి ఎంపీలను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ర్యాలీకి అనుమతి లేదంటూ పీటీఐ భవనం ఎదుట పోలీసులు

తరువాయి 2లో



## ఎస్పీజీలో తొలి మహిళా అధికారి అదాసో కపెసా

న్యూఢిల్లీ,ఈ కబురు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల యూకే పర్యటనలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన ఫొటో వైరల్‌గా మారింది. అది ప్రధాని మోదీది కాదు ఆయన వెనుక అచంచలంగా నిలబడి ఉన్న ఓ మహిళా అధికారిది.

తరువాయి 2లో

## కోర్టును మరింత సమయం కోరదామా?



- బీసీ రిజర్వేషన్లపై పార్టీ పరంగా 42% ప్రకటించి ముందుకెళ్దామా?
- రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ భేటీలో చర్చ
- రాజకీయ వ్యవహారాల కమిటీలో నిర్ణయం
- వారం రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీ!
- 23 నుంచి ప్రజాపథం పునఃప్రారంభం
- ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం!

హైదరాబాద్, ఈ కబురు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిర్ణయించారు. ఈ నెల 16 లేదా 17న పీఏసీ సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. మహేశ్‌గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, ఇతర అంశాలపై చర్చించారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు కోర్టు ఇచ్చిన గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఎలా ముందుకువెళ్లాలన్నదానిపై సమాలోచనలు జరిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు, పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ తెచ్చిన ఆర్డినెన్సు రెండూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశం చర్చకు వచ్చింది. ఈ విషయాన్ని కోర్టుకు నివేదించి.. స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొంత గడువు కోరితే ఎలా ఉంటుందన్న విషయంపై నేతలిద్దరూ చర్చించారు. కోర్టు అనుమతిస్తే కేంద్రంపై మరోమారు ఒత్తిడి కార్యాచరణ చేపట్టవచ్చని భావిస్తున్నారు. అలా కాకుండా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా 42% రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లుగా ప్రకటించి, ఎన్నికలకు వెళ్లడంపైనా చర్చించారు. పీఏసీ సమావేశం తర్వాతే స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత రానుంది.

తరువాయి 2లో

## స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలి: కేసీఆర్

- ఎమ్మెల్సీల ఫిరాయింపుపై త్వరలో పిటిషన్ వేయాలి
- బీఆర్ఎస్ ముఖ్య నేతలకు కేసీఆర్ ఆదేశం
- బీసీ రిజర్వేషన్ల పెంపుపై సర్కారు చేతులెత్తేసిందని వ్యాఖ్య
- 14న బీసీల కదన భేరి ఏర్పాట్లపైనా చర్చ



ఈ కబురు, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ ముఖ్య నేతలను ఆదేశించారు. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు జరుగుతున్న సన్నద్ధతపై ఆరా తీశారు.

తరువాయి 2లో

## ఆర్థిక వ్యవస్థను ఖతం పట్టించారు



- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శ
- రైతు బీమా గతంలో మాదిరిగా రెన్యువల్ చేయాలని డిమాండ్

ఈ కబురు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనలో తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు సంగతేమో కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మాత్రం గ్యారెంటీగా ఖతం పట్టించిందని అన్నారు. కాగ్ ఇచ్చిన తాజా నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ.. రేవంత్‌రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక తెలంగాణ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిందని సోమవారం ఒక ప్రకటనలో కేటీఆర్ పేర్కొన్నారు.

తరువాయి 2లో

» 3లో



## దేశ రాజధానిలో 'నేషనల్ గార్డ్' మోహరింపు.. ట్రంప్ కీలక నిర్ణయం

## హైకోర్టు జడ్జీలు ఎవరికంటే తక్కువకారు

- అసభ్యకర ఆరోపణలపై సుప్రీంకోర్టు సీరియస్
- న్యాయమూర్తిపై ఆరోపణలు చేసిన కక్షిదారు, లాయర్లు క్షమాపణ చెప్పాలి
- రేవంత్‌రెడ్డిపై దాఖలైన అట్రాసిటీ కేసు విచారణలో సీజేఐ ధర్మాసనం



ఈ కబురు, న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కంటే తక్కువకాదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. న్యాయమూర్తులపై నిరాధారంగా, అసభ్యకరంగా ఆరోపణలు చేసే ధోరణి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది.

తరువాయి 2లో



## 'భారత్ మెర్సిడెస్.. పాక్ కంకర లారీ'.. 'ఫెయిల్డ్' మార్షల్ వ్యాఖ్యలపై ట్రోలింగ్

» 3లో

## ఇండియా కూటమి నిరసన సెగ: బారికేడ్ ఎక్కి దూకిన అఖిలేష్ యాదవ్...

» 3లో



మొదటి పేజీ తరువాయి

# ఓట్ల చోరీపై పోరుబాట



ఈ కబురు,న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)తోపాటు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో అక్రమాలు, ఓట్ల చోరీ, గత లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్‌పై విపక్ష 'ఇండియా' కూటమి పోరుబాట పట్టింది. ఓట్ల చోరీని వెంటనే ఆపాలని, 'ఒక్కరికి ఒక ఓటు' అనే విధానాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాం□దీ, ప్రియాంక గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలు సోమవారం దేశ రాజధానిలో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తెల్లటోపీలు ధరించి పార్లమెంట్ మకరద్వారం నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయలుదేరిన 'ఇండియా' కూటమి ఎంపీలను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ర్యాలీకి అనుమతి లేదంటూ పీటీఐ భవనం ఎదుట పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను పక్కకు తొలగించేందుకు ఎంపీలు ప్రయత్నించారు. కేవలం 30 మందిని అనుమతిస్తామని పోలీసులు చెప్పగా, ఎంపీలు అంగీకరించలేదు. ఎన్నికల సంఘానికి విజ్ఞాపన పత్రం అందజేయడానికి శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న తమను అడ్డుకోవడం ఏమిటని మండిపడ్డారు. కొందరు రోడ్డుపై బైఠాయించి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చయడం ఆపాలన్నారు. మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, సాగరికా ఘోష్, సుస్మితా దేవ్, సంజనా జాతవ్, జోతిమణితోపాటు సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు అఖిలేష్ యాదవ్ బారికేడ్లపైకి ఎక్కారు. ఎన్నికల సంఘం తీరుపై నిప్పులు చెరిగారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ గందరగోళం మధ్య మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, మితాలీ బేగ్ స్పృహ తప్పిపడిపోగా, రాహుల్ గాంధీ వారికి సపర్యలు చేశారు. తర్వాత పోలీసులు నిరసనకారులను బస్సుల్లోకి ఎక్కించి, పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెండు గంటల తర్వాత వారందరినీ విడుదల చేశారు.

రాజకీయ పోరాటం కాదు: రాహుల్

ఇది రాజకీయ పోరాటం కాదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పోరాటం ప్రారంభించామని స్పష్టంచేశారు. నిరసన ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్ట ప్రకారం ఒక్కరికి ఒక ఓటు మాత్రమే ఉండాలన్నారు. అక్రమాలు, అవకతవకలకు తావులేని స్వచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా కోసం ఉద్యమిస్తున్నామని ఉద్ఘాటించారు. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాల గురించి ప్రజలందరికీ తెలుసని చెప్పారు. ఎన్నికల సంఘం దీనిపై స్పందించడం లేదని నిలదీశారు. గత ఎన్నికల్లో దేశమంతటా జరిగిన రిగ్గింగ్‌పై త్వరలో బాంబు పేలుస్తానని రాహుల్ మరోసారి వెల్లడించారు. ఎన్నికల సంఘం కోరుతున్నట్లుగా సంతకం చేసిన అఫిడవిట్ సమర్పించే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి తీసుకున్న సమాచారాన్ని విశ్లేంచి, ఓట్ల చోరీని బయటపెట్టానని, ఇంతకంటే సాక్ష్యాధారాలు ఇంకేం కావాలని ప్రశ్నించారు. అది తాను సృష్టించిన డేటా కాదని స్పష్టంచేశారు.

బీజేపీ కుట్రలను అడ్డుకుంటాం: ఖర్గే

ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూనే ఉంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. ఓట్ల చోరీని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఎస్ఐఆర్ పేరిట ఓటర్ల జాబితాలను తారుమారు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటామని అన్నారు. ఈ మేరకు ఖర్గే 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశంలో బీజేపీ నిరంకుశత్వం చెల్లదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. సాక్షాత్తూ పార్లమెంట్ ఎదుటే ప్రజాస్వామ్యంపై దాడి జరిగిందని, ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. ప్రతిపక్ష ఎంపీలను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. తమ డిమాండ్లపై ఎన్నికల సంఘానికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం దొంగతనం చేసే సంఘంగా మారొద్దని జైరాం రామేశ్ హితవు పలికారు. నిరసన ర్యాలీలో శరద్ పవార్(ఎన్సీపీ-ఎస్పీ), టి.ఆర్.బాలు(డీఎంకే), సంజయ్ రౌత్(శివసేన-ఉద్ధవ్), డెరెక్ ఓబ్రెయిన్(టీఎంసీ)తోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యుడు సంజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, నిరసన ర్యాలీ కోసం ఎవరూ అనుమతి తీసుకోలేదని ఢిల్లీ పోలీసులు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బారికేడ్ దాటేసిన అఖిలేశ్

నిరసన ర్యాలీలో తమను అడ్డుకున్న పోలీసులపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లను తోసుకొని ముందుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్ ఎక్కి అవతలికి దూకేశారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ప్రజా ఉద్యమంలా మారింది: రాహుల్

న్యూఢిల్లీ: 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా చేపట్టిన ప్రచారం ఉధృతమై ప్రజా ఉద్యమంలా మారిందని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పోర్టల్ ప్రారంభించినప్పటి నుంచి మద్దతుగా 15 లక్షల సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని, 10 లక్షల వరకు మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఇండియా కూటమి నిరసన సెగ: బారికేడ్ ఎక్కి దూకిన అఖిలేష్ యాదవ్...



ఈ కబురు: ఢిల్లీ పార్లమెంటు నుండి ప్రతిపక్ష నాయకుల మార్చ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పోలీసు బారికేడ్‌పైకి ఎక్కి దూసుకెళ్లారు. ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ల లిస్టుల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను వ్యతిరేకిస్తూ అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓటర్ల మోసం జరిగిందని ఆరోపిస్తూ ఈ నిరసన చేపట్టారు.కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఈ మార్చ్ ఉదయం 11:30 గంటలకు పార్లమెంట్ నుండి మొదలైంది. ఈ మార్చ్‌లో ఉభయ సభల నుండి మొత్తం 300 మందికి పైగా ఎంపీలు పాల్గొన్నారు. అయితే, ఢిల్లీ పోలీసులు ఈసీ ఆఫీసుకి వెళ్లే దారిలో బారికేడ్లు పెట్టడంతో నిమిషాల్లోనే పరిస్థితి వేడెక్కింది. నిజం దేశం ముందు ఉంది. ఈ పోరాటం రాజకీయం కోసం కాదు, రాజ్యాంగాన్ని కాపాడటానికి. ఈ పోరాటం ఒక మనిషి, ఒక ఓటు కోసం. మాకు స్వచ్ఛమైన ఓటర్ల లిస్ట్ కావాలి అని అన్నారు. ఈ మార్చ్ సమయంలో శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసులు, క్విక్ రియాక్షన్ బృందాలను, అదనపు భద్రతా వాహనాలను మోహరించారు. నిరసనకి ముందు ఢిల్లీ పోలీసుల ప్రకారం మార్చ్ కోసం ఎవరు అనుమతి తీసుకోలేదని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి EC ఆఫీస్, పరిసర ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లు ముమ్మరం చేశారు.బీహార్‌లో జరుగుతున్న అక్రమాలు, ఓటర్ల లిస్టుల తారుమారు రాబోయే ఎన్నికలకి ముప్పు కలిగిస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. SIRకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ పార్లమెంటు నుండి భారత ఎన్నికల కమిషన్ వరకు మార్చ్ నిర్వహించిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సంజయ్ రౌత్, సాగరికా ఘోష్ సహా ఇతర ఎంపీలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నిరసన సమయంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు, వాటికి సమాధానాలు అవసరం. ఎన్నికల కమిషన్ దేశం పట్ల బాధ్యత వహించడమే కాకుండా, మన ఎన్నికల గురించి ప్రజల మనస్సులలో ఎటువంటి అనుమానాలు ఉండకూడదనే బాధ్యత కూడా ఉంది. ఎన్నికలు దేశానికి ముఖ్యమైనది. ప్రజల మనస్సులలో ఏవైనా అనుమానాలు ఉంటే, వాటిని పరిష్కరించాలి అని అన్నారు.

# ఎస్పీజీలో తొలి మహిళా అధికారి అదాసో కపెసా



న్యూఢిల్లీ,ఈ కబురు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల యూకే పర్యటనలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన ఫొటో వైరల్‌గా మారింది. అది ప్రధాని మోదీది కాదు ఆయన వెనుక అచంచలంగా నిలబడి ఉన్న ఓ మహిళా అధికారిది. ఆమె పేరు అదాసో కపెసా భారత ప్రధాని వ్యక్తిగత భద్రతా విభాగం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీజీ)లో చేరిన తొలి మహిళా అధికారిగా ఆమె గుర్తింపు పొందారు. 1885లో ఏర్పాటైన ఎస్పీజీలో ఓ మహిళా అధికారి విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి కావడం విశేషం. మణిపుర్‌లోని సేనాపతి జిల్లా కైబీ గ్రామానికి చెందిన కపెసా ప్రస్తుతం ఎస్పీజీలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. అంతకుముందు ఆమె సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)లో చేరి 55వ బెటాలియన్‌లో ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్‌లో సేవలందించారు. ఓ మారుమూల గ్రామం నుంచి ఎస్పీజీలో అధికారిగా ఎదిగిన కపెసా ప్రయాణం తన వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా తనలాంటి ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

మొదటి పేజీ తరువాయి

# కోర్టును మరింత సమయం కోరదామా?



ఈ విషయాన్ని కోర్టుకు నివేదించి.. స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొంత గడువు కోరితే ఎలా ఉంటుందన్న విషయంపై నేతలిద్దరూ చర్చించారు. కోర్టు అనుమతిస్తే కేంద్రంపై మరోమారు ఒత్తిడి కార్యాచరణ చేపట్టవచ్చని భావిస్తున్నారు. అలా కాకుండా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా 42౦ రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లుగా ప్రకటించి, ఎన్నికలకు వెళ్లడంపైనా చర్చించారు. పీఏసీ సమావేశం తర్వాతే స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత రానుంది. పార్టీ పరంగా బీసీలకు 42౦ రిజర్వేషన్ ప్రకటించి, ముందుకు వెళ్లాలని పీఏసీలో నిర్ణయం తీసుకుంటే.. సెప్టెంబరు 10 తర్వాత స్థానిక ఎన్నికలు ఉండొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ లోపు ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది.

వారంలో నామినేటెడ్ పదవుల భర్తీ?

పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మహేశ్‌గౌడ్ నిర్ణయించినట్లు తెలిసింది. జిల్లా, లోక్‌సభ నియోజకవర్గ స్థాయి పరిశీలకులు.. నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి నియోజకవర్గానికి రెండు పేర్లతో ఇచ్చిన ప్రతిపాదనలు సీఎం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ఎన్నికలకు ముందే ఈ పోస్టులను భర్తీ చేసి, కార్యకర్తల్లో కదలిక తీసుకురావాలన్న ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నారు.

జూబ్లీహిల్స్ అభ్యర్థిపై మరో సర్వే!

గెలుపే ప్రాతిపదికగా, సర్వేల ఆధారంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిర్ణయించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో కీలకమైన ఈ ఉప ఎన్నికలో అభ్యర్థిపై ఎలాంటి ఒత్తిడికీ తావు లేకుండా.. సర్వేల ఆధారంగానే నిర్ణయానికి రావాలని అనుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీల వారీగా జరిగిన సర్వేలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వం కోసం ప్రస్తుతం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత నవీన్ యాదవ్, రెహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు ప్రధానంగా పోటీ పడుతున్నారు. వీరి అభ్యర్థిత్వాలపై పార్టీ సర్వే జరుగుతోంది. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖల వారీగా సమీక్షించారు. జనహిత పాదయాత్రల ద్వారా వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నేతలిద్దరూ నిర్ణయించారు. ఈ నెల 23 నుంచి పాదయాత్రను పునఃప్రారంభిస్తున్నామని, యాత్రలో ఒక రోజు పాల్గొనాలని సీఎం రేవంత్‌ను మహేశ్‌గౌడ్ కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

# స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలి: కేసీఆర్



ఈ కబురు, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ ముఖ్య నేతలను ఆదేశించారు. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు జరుగుతున్న సన్నద్ధతపై ఆరా తీశారు. ఢిల్లీలో న్యాయవాదులు కోరిన విధంగా పూర్తి సమాచారాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని కేటీఆర్‌ను ఆదేశించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కేసీఆర్ సోమవారం ఎర్రవల్లి నివాసంలో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై ఆయన చర్చించినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు

రాష్ట్ర ప్రభుత్వ స్థానిక ఎన్నికల సన్నద్ధతపై చర్చించడంతో పాటు బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు సంబంధించిన పరిణామాలు భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంలో ప్రభుత్వం ఇప్పటికే చేతులెత్తేసిందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశముందని సమావేశంలో నేతలు అంచనా వేశారు. ఈ నెల 14న కరీంనగర్ వేదికగా బీఆర్ఎస్ నిర్వహించే 'బీసీల కదన భేరి' సభ ఏర్పాట్లపైనా చర్చించారు. సభలో రిజర్వేషన్ల అంశాన్ని బలంగా ప్రస్తావించి కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టాలని కేసీఆర్ ఆదేశించారు.

బనకచర్లపై దిశా నిర్దేశం

ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టుపై ఇటీవల ఢిల్లీలో న్యాయ నిపుణులతో హరీశ్ జరిపిన సంప్రదింపులకు సంబంధించి చర్చ జరిగినట్లు తెలిసింది. జాతీయ స్థాయిలో ఏపీ సీఎం చంద్రబాబు వేస్తున్న ఎత్తుగడలకు పార్టీ పరంగా చెక్ పెట్టేలా ఎలాంటి వ్యూహం అనుసరించాలనే అంశంపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అసెంబ్లీ సమావేశాలకు సన్నద్ధతపై చర్చ

స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనకు ముందే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని కేసీఆర్ అభిప్రాయపడినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెడితే అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలిసింది. దీనిపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని కేసీఆర్ వెల్లడించినట్లు సమాచారం.

విలీనం ప్రచారాన్ని తిప్పికొట్టాలి

'ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి పదేళ్లు అధికారంలో కొనసాగి, ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తోంది. కానీ బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతోందని కొందరు ఉద్దేశపూర్వక ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో కేడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లక ముందే విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టండి..' అని బీఆర్ఎస్ అధినేత ఆదేశించారు.

# ఆర్థిక వ్యవస్థను ఖతం పట్టించారు




ఈ కబురు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనలో తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు సంగతేమో కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మాత్రం గ్యా రెంటీగా ఖతం పట్టించిందని అన్నారు. కాగ్ ఇచ్చిన తాజా నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ.. రేవంత్‌రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక తెలంగాణ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజా రిందని సోమవారం ఒక ప్రకటనలో కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే రూ.20,266 కోట్లు అప్పు 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. కాగ్ నివేదిక ప్రకారం, రాష్ట్ర ఆదాయం పడిపోవడంతో పాటు అప్పులు భారీగా పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.20,266 కోట్లు ప్రభు త్వం అప్పుగా తీసుకుంది. వార్షిక ల క్ష్యంలో ఇది 37.5 శాతం. కొత్తగా ఏ రోడ్లు వేయకుండా, ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభించకుండా, విద్యార్థులకు కనీసం మంచి భోజనమైనా పెట్టకుండా ఈ నిధులను ఏం చేస్తున్నారు? పన్నేతర ఆదా యం కూడా దారుణంగా పడిపోయింది.బడ్జెట్‌లో అంచనా వేసిన దానిలో కేవలం 3.37 శాతం మాత్రమే వసూలు అ యింది. మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైన తెలంగాణ, ఇప్పు డు రూ.10,583 కోట్ల రెవెన్యూ లోటును ఎదుర్కోవడం అసమర్థ పాలనకు నిదర్శనం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడి లో పెట్టడానికి ప్రభుత్వం దగ్గర ఎలాంటి ప్రణాళిక ఉందో ప్రజలకు స్పష్టంగా చెప్పాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఏ ఒక్క పథకం సరిగ్గా అమలు కావడం లేదు

కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుందని, ఒక్క పథకమూ నిర్దిష్టంగా అమలు కావడం లేదని కేటీఆర్ విమర్శించారు. తిక్కలోడు తిరునాళ్లకు పోతే..ఎక్కా దిగా సరిపోయిందన్న చందంగా ప్రభుత్వం తీరుందని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఎద్దేవా చేశారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు బీమా పథకం కింద 2018 నుంచి 2023 డిసెంబర్ వరకు 1,11,320 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.5,566 కోట్ల పరిహారం అందించాం.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బీమా ప్రీమియం చెల్లించలేదు. వేలాదిమంది రైతు కుటుంబాలు బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 14తో రైతుబీమా ప్రీమియం గడువు ముగుస్తుంది. ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయడం ఆనవాయితీ. అయితే గడువు దగ్గరకు వచ్చిన తర్వాత రైతుబీమా కోసం రైతు స్వయంగా స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రం అందజేయాలని, తనతో పాటు నామినీ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు కూడా అందజేయాలనే నిబంధన విధించారు. ప్రస్తుతం ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో రైతుబీమాకు రైతులు మళ్లీ దరఖాస్తు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం మూర్ఖత్వం. గతంలో మాదిరిగానే ప్రభుత్వం రైతు బీమా రెన్యువల్ చేయాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# టెన్త్ పరీక్షల పై సర్కార్ యూ టర్న్



ఈ కబురు : పదవ తరగతి పరీక్షలపై తెలంగాణ ప్రభుత్వం యూ టర్న్ తీసుకుంది. పదవ తరగతి పరీక్షల్లో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ఎత్తేయాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. ప్రస్తుతం ఈ నిర్ణయంపై వెనుకడుగు వేసింది. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇంటర్నల్ విధానాన్ని కొనసాగిస్తామని ప్రకటించింది. వార్షిక పరీక్షల్లో 80 మార్కులు, 20 ఇంటర్నల్ మార్కుల విధానాన్నే ఈ విద్యా సంవత్సరం కూడా కంటిన్యూ చేస్తామని పాఠశాల విద్యాశాఖ బోర్డు పేర్కొంది. కాగా ఈ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రయివేట్ పాఠశాలల ఒత్తిడితోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

# హైకోర్టు జడ్జీలు ఎవరికంటే తక్కువకారు




ఈ కబురు, న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కంటే తక్కువకాదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. న్యాయమూర్తులపై నిరాధారంగా, అసభ్యకరంగా ఆరోపణలు చేసే ధోరణి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ మౌషుమి భట్టాచార్యపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కక్షిదారు పెద్దిరాజు, ఆయన తరఫు న్యాయవాదులు బేషరతు క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఒక వారంలోపు క్షమాపణ పిటిషన్ సమర్పించాలని, ఆ తర్వాత హైకోర్టు న్యాయమూర్తి ఆ క్షమాపణను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. సోమవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ అతుల్ ఎస్.చందుర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 'ఇటీవలి కాలంలో కారణం లేకుండా హైకోర్టు, ట్రయల్ కోర్టు జడ్జీలను విమర్శించే అలవాటు పెరిగింది. హైకోర్టు న్యాయమూర్తులు సుప్రీంకోర్టు జడ్జీలతో సమాన రక్షణ పొందుతారు. రాష్ట్రంలో రాజకీయ నాయకుడిపై కేసు ఉంటే ఆ రాష్ట్రంలో న్యాయం దొరకదని భావించి పిటిషనర్ ఆ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరే సంస్కృతి పెరిగింది'అని ధర్మాసనం పేర్కొంది. కాగా సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పులను మార్చగలిగినా, హైకోర్టు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణ లేదని చెప్పింది. హైకోర్టు న్యాయమూర్తులపై చేసిన ఆరోపణలు అవమానకరంగా ఉన్నాయని, వీటిని సహించలేమని హెచ్చరించింది. 'లాయర్లను శిక్షించడం కోర్టులకు ఆనందం కాదు. కానీ కోర్టుల వ్యవహారంలో జోక్యం చేసుకునేలా వ్యవహరిస్తే ఏమాత్రం సహించం'అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు.

కేసును మళ్లీ తెరవండి

ప్రస్తుత కేసు సీఎం రేవంత్ రెడ్డిపై ఎస్సీ/ఎస్టీ చట్టం కింద నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టివేయడంతో పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ తీర్పు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై పక్షపాతం, తప్పుడు ప్రవర్తన ఆరోపణలు చేస్తూ ఎన్.పెద్దిరాజు సుప్రీంకోర్టులో ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జూలై 29న సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే న్యాయమూర్తిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినందుకు పిటిషనర్, ఆయన తరఫు న్యాయవాదులకు కంటెప్ట్ నోటీసులు జారీ చేసింది. కాగా సుప్రీంకోర్టు 1954లో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం ప్రస్తావించింది. ఇలాంటి అవమానకర, అసభ్యకర ఆరోపణలకు పిటిషనర్ మాత్రమే కాకుండా, పిటిషన్‌పై సంతకం చేసిన న్యాయవాదులు కూడా సమాన బాధ్యత వహించాలన్నది ఆ తీర్పు సారాంశమని ధర్మాసనం గుర్తు చేసింది. హైకోర్టు న్యాయమూర్తికి క్షమాపణ చెప్పడం సరైనదని భావిస్తూ, కేసు మళ్లీ తెరిచి న్యాయమూర్తి ముందుంచాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. ఒక వారం లోపు క్షమాపణ సమర్పించాలని, ఆ తర్వాత మరో వారం లోపు న్యాయమూర్తి ఆ క్షమాపణపై నిర్ణయం తీసుకోవాలని సీజేఐ చెప్పారు. కాగా పిటిషనర్ పెద్దిరాజు తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే బేషరతు క్షమాపణ పిటిషన్ సమర్పించారు

# సివిల్స్ అభ్యర్థులకు ఎంతైనా సహకరిస్తాం



ఓ అభ్యర్థికి చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం. చిత్రంలో గండ్ర సత్యనారాయణ, రాజ్ ఠాకూర్, నవీన్ మిట్టల్, హర్కర వేణుగోపాల్, జనక్‌ప్రసాద్

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సింగరేణి తోడ్పాటుతో 178 మంది సివిల్స్ అభ్యర్థులకు రూ. లక్ష చొప్పున చెక్కుల అందజేత

ఈ కబురు, హైదరాబాద్: సివిల్స్ సాధించాలనుకునే అభ్యర్థులకు ఎంతయినా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సివిల్స్‌లో తెలంగాణ విద్యార్థులే అత్యధికంగా ఎంపిక అవ్వాలని ఆయన అన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం'పథకం పేరుతో సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమయ్యే 178 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించే చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రజాభవన్‌లో జరిగింది. చెక్కులు అందించిన అనంతరం భట్టి మాట్లాడారు. సమాజంలో మానవ వనరులే బలమైన పెట్టుబడులని, వీటిని సానబట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.లక్ష ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక తోడ్పాటునిచ్చినట్టు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకమని, ప్రజల జీవన స్థితిగతులను వీరే మార్చగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎక్కువ మంది ఎంపికవ్వాలి: కోమటిరెడ్డి

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపికైతే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పథకం సహాయంతో సివిల్స్‌లో విజయం సాధించి, పరిపాలన విభాగంలో అంకిత భావంతో పనిచేయాలని కోరారు.

ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ పేదింటి పిల్లలు కూడా సివిల్స్‌లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. 2024లో తెలంగాణ ప్రాంతం నుంచి సివిల్స్ విజేతలైన 30 మందికి ఈ సందర్భంగా మెమెంటోలను బహూకరించారు. వరంగల్‌కు చెందిన ఎట్టబోయిన సాయిశివాని సివిల్స్‌లో 11వ ర్యాంక్ సాధించడంపై ముఖ్యఅతిథులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఐదు రోజులపాటు భారీ వర్షాలు



13 నుంచి అల్పపీడన ప్రభావం

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ఉత్తర తెలంగాణతోపాటు పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం రాష్ట్రంలోనే అత్యధికంగా నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో 6.6, గుడిపల్లి మండలంలో 6.5, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 6.4 సెం.మీ. వర్షం కురిసింది. సంగారెడ్డి, వికారాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ, వరంగల్, నిర్మల్, కరీంనగర్ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

# భారత్ మెర్సిడెస్.. పాక్ కంకర లారీ'.. 'ఫెయిల్డ్' మార్షల్ వ్యాఖ్యలపై ట్రోలింగ్




ఈ కబురు:పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్న విషయం తెలిసిందే. తాము నాశనమైతే.. తమతో పాటు సగం ప్రపంచాన్ని పతనం వైపునకు తీసుకెళ్తామంటూ అమెరికాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రేలాపనలు చేశారు. ఈ క్రమంలోనే భారత్, పాకిస్థాన్‌లను పోల్చుతూ చేసిన వింత వ్యాఖ్యలతో ఆయన నెట్టింట అభాసుపాలయ్యారు. తెలియకుండానే ఆయన భారత్‌ను పాకిస్థాన్‌కంటే మెరుగైనదిగా పేర్కొన్నారని నెటిజన్లు సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోలింగ్ చేస్తున్నారు.

''భారత్ అనేది హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. కానీ.. పాకిస్థాన్ మాత్రం కంకరతో నిండిన ఓ డంప్ లారీలాంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం?'' అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే.. పాక్‌ను గొప్పగా చూపాలనే ఆయన ప్రయత్నం కాస్త బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. పోలికలోనూ తన సొంత దేశం పరువు తీస్తున్నారంటూ నెటిజన్లు పేర్కొంటున్నారు. పలువురి కామెంట్స్ పరిశీలిస్తే..''మునీర్ ప్రసంగంలో 'భారత్ మెర్సిడెస్ కారు.. పాకిస్థాన్ డంప్ లారీ' అన్నది మాత్రమే నిజం. మిగతాదంతా ఉత్త కథే. అణు బెదిరింపులకు పాల్పడి అమెరికా, చైనా వెనుక దాక్కోగలనని ఆయన భావిస్తున్నారు. అయితే.. పాకిస్థాన్ సైనిక సామర్థ్యాలూ అంతంతే. ఒకవేళ భారత్‌లోని ఆనకట్టలను ధ్వంసం చేయాలని యత్నిస్తే.. పాకిస్థాన్ చరిత్ర చెత్తబుట్టలోకి వెళ్లిపోతుంది. ఏ మిత్రదేశాలు దాన్ని కాపాడలేవు''

''తాము కేవలం డంప్ లారీ తప్ప మరేదీ కాదనే వాస్తవం వారికి తెలుసు. తాము దుర్బలంగా ఉన్నామనే విషయాన్ని 'ఫెయిల్డ్' మార్షల్ అంగీకరించారు''

''భారత్ అనేది క్షిపణులు లోడ్ చేసిన మెర్సిడెస్. అది ప్రాణాంతకం కావొచ్చు. మిమ్మల్ని నాశనం చేస్తుంది''

''ఈ వ్యాఖ్యలను మొదటిసారి చదివినప్పుడు జోక్ అనుకున్నారు. కానీ ఇది నిజం. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌గా అసీం మునీర్ నిజంగా అర్హుడే'' అంటూ ఓ నెటిజన్ వ్యంగ్యంగా స్పందించారు.

అసీం మునీర్ వ్యాఖ్యలను భారత్ ఇప్పటికే తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదని, దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోమని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది.

# సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

గరిడేపల్లి పీఎస్‌లో కేసు కొట్టివేత

ఈ కబురు, హైదరాబాద్: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి ఊరట లభించింది. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ హైకోర్టు తుదిఉత్తర్వులు జారీ చేసింది. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు గరిడేపల్లి పీఎస్‌లో అప్పటి ఎంపీ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై 2019, జనవరి 19న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎలాంటి అనుమతి లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పొనుగోడులో సమావేశం నిర్వహించారన్నది ఫిర్యాదు. ఆధారాలు లేకుండా తనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చారు.

ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు..

వరంగల్ జిల్లా కమలాపూర్ పీఎస్‌లో నమోదైన కేసులో ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి రేవంత్‌రెడ్డికి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను, ఫిర్యాదుదారును ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. హుజూరాబాద్ ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి దాదాపు 2,500 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారన్న ఫిర్యాదు మేరకు రేవంత్‌పై కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు.



# దేశ రాజధానిలో 'నేషనల్ గార్డ్' మోహరింపు.. ట్రంప్ కీలక నిర్ణయం



ఈ కబురు: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ శాంతిభద్రతల విషయంలో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజధానివ్యాప్తంగా 'నేషనల్ గార్డ్ ' బలగాలను మోహరిస్తున్నట్లు ప్రకటించారు. నేరాల కట్టడి కోసం మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను ఫెడరల్ నియంత్రణలోకి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. స్థానికంగా 'పబ్లిక్ సేఫ్టీ ఎమర్జెన్సీ'ని ప్రకటిస్తున్నట్లు చెప్పారు. దేశ రాజధానిలో నేరాలు తగ్గుముఖం పట్టాయని స్థానిక మేయర్ మురియెల్ బౌసర్ ప్రకటించినప్పటికీ.. ఈమేరకు చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల విషయంలో ఇరాక్, బ్రెజిల్, కొలంబియా దేశాల రాజధానులతో పోలిస్తే వాషింగ్టన్‌లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని మీడియా సమావేశంలో ట్రంప్ ఆరోపించారు. అదేవిధంగా.. అధికార యంత్రాంగం దేశ రాజధాని పార్కుల్లోని నిరాశ్రయుల శిబిరాల తొలగింపు ప్రక్రియ ప్రారంభించిందన్నారు. మురికివాడలను కూడా తొలగిస్తున్నట్లు చెప్పారు. అమెరికా తన నగరాలను చేజార్చుకోదని.. ఈ విషయంలో వాషింగ్టన్ ఒక ప్రారంభం మాత్రమేనన్నారు. వాషింగ్టన్ మెట్రో పోలీస్ విభాగం బాధ్యతలు యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండి స్వీకరించనున్నట్లు తెలిపారు.

అక్రమ వలసదారుల ఏరివేతే లక్ష్యంగా ఇటీవల లాస్‌ఏంజెలెస్‌లో ఫెడరల్ అధికారులు చేపట్టిన తనిఖీలు ఉద్రిక్తతలకు దారి తీసిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనూ అక్కడికి నేషనల్ గార్డు బృందాలను తరలించారు. శాంతిభద్రతలు అదుపు తప్పిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు శ్వేతసౌధం ఓ ప్రకటన విడుదల చేసింది.

# మందుబాబులకు ఇక ఇంటి వద్దకే మద్యం: స్విగ్గీ రెడీ

**ఇంట్లో స్టాక్ పెట్టుకోవాల్సిన అవసరం లేదు.. చాంతాడంత క్యూలలో నిలుచోవాల్సిన పనిలేదు. రోజూ వైన్ షాప్‌లో కనపడుతుంటే జనం అదోలా చూస్తారనే సంకోచాలక్కర్లేదు. దర్జాగా కాలు మీద కాలేసుకుని ఇంట్లో కూర్చుని కావాల్సిన మందు తెప్పించుకోవచ్చు. అంతేనా, దానితో కలిపి లాగించే సైడ్ డిష్‌లు కూడా ఒకేసారి అందుకోవచ్చు. మరి మందుబాబుల ఇలాంటి కల సాకారం కావాలంటే.. ఆన్‌లైన్‌లో మద్యం అమ్మకాలు షురూ కావాలి. ఈ దిశగా ఇప్పటికే పలు రాష్ట్రాలు ముందడుగేశాయి.**




ఒడిశా పశ్చిమ బెంగాల్‌లు మద్యం హోమ్ డెలివరీని అనుమతిస్తున్న తొలి రెండు భారతీయ రాష్ట్రాలుగా ఘనత దక్కించుకున్నాయి. ఇదే కోవలో స్విగ్గీ, జొమాటో బిగ్‌బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆన్ లైన్ మద్యం అమ్మకాలను అనుమతించే అవకాశాన్ని అనేక ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలిస్తున్నాయి. ఈ రాష్ట్రాల్లో కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళ, కేంద్ర పాలిత ప్రాంతం ఢిల్లీ లు ముందు వరుసలో ఉన్నాయి. వీటిలో కేరళ మరింత చురుకుగా ఈ విషయంపై చర్చిస్తోందని రేపో మాపో దీనిపై నిర్ణయం తీసుకోవచ్చునని తెలుస్తోంది.
కేరళ స్టేట్ బేవరేజెస్ (మార్కెటింగ్ - మాన్యుఫ్యాక్చరింగ్) కార్పొరేషన్ లిమిటెడ్ (బిఇవిసిఒ) రాష్ట్రంలో ఆన్‌లైన్ అమ్మకాల ద్వారా మద్యం ఇంటికి డెలివరీ చేసే ప్రతిపాదనను ఇటీవలే ముందుకు తెచ్చింది. కేరళలో ఆన్ లైన్ లో మద్యం అమ్మకాలను సులభతరం చేయడానికి అబ్కారీ చట్టాన్ని సవరించే గతంలో రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చినప్పటికీ, బిఇవిసిఒ ఈ ప్రతిపాదనను మరోసారి తెరపైకి తెచ్చింది.

గత జూలైలో బిఇవిసిఒ ఎండి హర్షిత అత్తలూరి ఈ ప్రతిపాదనను ఎక్సైజ్ శాఖకు సమర్పించారు. ఆన్‌లైన్‌లో మద్యం డెలివరీ కోసం ఫుడ్, కిరాణా డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ నుంచి తాము ప్రాజెక్ట్ ప్రతిపాదనను అందుకున్నట్లు అత్తలూరి చెప్పారు. 'ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదిస్తే, మేం టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తాము. ఎవరు తక్కువ మొత్తాన్ని బిడ్ చేస్తారో వారికి బిడ్ ఇవ్వడం జరుగుతుంది.

ఈ ప్రతిపాదన ప్రకారం, 23 సంవత్సరాలు నిండిన వ్యక్తి మాత్రమే మద్యం కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయవచ్చు. వయస్సును నిర్ధారించడానికి ఐడీని తనిఖీ చేస్తారు. మా అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉన్న అన్ని రకాల ఉత్పత్తులు కూడా ఆన్ లైన్ లో విక్రయాలు జరుగుతాయి,' అని హర్షిత అత్తలూరి చెబుతున్నారు.

రిటైల్ అవుట్‌లెట్‌లలో రద్దీని నివారించడమే ఈ ప్రతిపాదన వెనుక ఉన్న ముఖ్య కారణం. కేరళలో మద్యం దుకాణాల ముందు పొడవైన క్యూలు కనపడడం సర్వసాధారణం, పలు చోట్ల ఇది ట్రాఫిక్ రద్దీకి కూడా దారితీస్తుంది. తమిళనాడు వంటి 4700 మద్యం దుకాణాలు ఉన్న రాష్ట్రాల మాదిరిగా కాకుండా, కేరళలో కేవలం 283 దుకాణాలు మాత్రమే ఉన్నాయి. దీనివల్ల పొడవాటి క్యూలు, రద్దీ ఏర్పడుతుంది. ఆన్‌లైన్ అమ్మకాలు చురుకుగా మారిన తర్వాత, విక్రయాల్లో గణనీయమైన భాగం ఆన్ లైన్ అమ్మకాల ప్లాట్‌ఫామ్‌కు మళ్లుతుంది. ఇది అవుట్‌లెట్‌ల ముందు రద్దీని గణనీయంగా తగ్గిస్తుంది' అని అత్తలూరి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా మద్యం హోమ్ డెలివరీ ఆదాయాన్ని కూడా పెంచుతుందని కూడా బిఇవిసిఒ ఆశిస్తోంది. ఇప్పటికే అనేక రకాల చర్యల ద్వారా మద్యం మీద ఆదాయాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంది కేరళ రాష్ట్రం. గత 2016-17లో మద్యం నుంచి వచ్చిన ఆదాయం రూ.8778.29 కోట్లు కాగా కేవలం ఏడేళ్ల కాలంలో..గత 2024-25లో, మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.19,700 కోట్లు కావడం దీనికి అద్దం పడుతోంది. అయితే 'ఆన్ లైన్ అమ్మకాలతో ఈ ఆదాయం మరింత అసాధారణ రీతిలో పెరుగుతుందని తాము ఆశిస్తున్నాం అంటున్నారు హర్షిత అత్తలూరి అయితే ఈ ప్రతిపాదనను గతంలో పరిశీలించి తిరస్కరించామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

'మద్యం అమ్మకం అనేది 1953 నాటి చట్ట నిబంధనల ప్రకారం జరుగుతోంది. రాష్ట్రంలో ఆన్‌లైన్ అమ్మకాలను ప్రవేశపెట్టాలంటే, అందుకు అనుగుణంగా చట్ట సవరణలు చేయాలి అంతేకాకుండా తదనుగుణంగా నియమాలను రూపొందించాలి. అన్నింటికన్నా ముందు దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలి' అని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు.

కోవిడ్ సమయంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం వర్చువల్ క్యూ సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్‌లో మద్యం అమ్మకాన్ని ప్రవేశపెట్టింది. దీని కోసం ఒక అప్లికేషన్ కూడా అభివృద్ధి చేసింది. మద్యం వనరు ప్రధాన ఆదాయ మార్గంగా ఉన్న తరుణంలో కోవిడ్ కాలపు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కేరళ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవచ్చుననే అభిప్రాయాలు వస్తున్నాయి. ఇదే జరిగితే పొరుగు రాష్ట్రమైన కేరళ లో ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభమై భారీ ఆదాయం కళ్ల జూస్తే.. ఆదాయం కోసం ఆవురావురు మంటున్న మన తెలుగు రాష్ట్రాలు సైతం అదే బాటలో నడిచే అవకాశం లేకపోలేదు.



## లావా బ్లేజ్ అమోలెడ్2.. ధర, స్పెసిఫికేషన్స్ ఇవే!

దేశీయ మొబైల్ తయారీ సంస్థ లావా కొత్త ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. లావా బ్లేజ్ అమోలెడ్ 2 పేరిట దీన్ని లాంచ్ చేసింది. దీనిలో మీడియాటెక్ డైమెన్‌సిటీ 7060 ప్రాసెసర్, 50 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఈ సెగ్మెంట్‌లో ఇదే స్లిమ్మెస్ట్ ఫోన్‌గా కంపెనీ పేర్కొంది.
ఈ ఫోన్‌లో 6.67 అంగుళాల ఫుల్‌హెచ్‌డీ ప్లస్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్‌రేటుతో వస్తోంది. ఫోన్ వెనక భాగంలో 50 ఎంపీ సోని IMX752 ప్రధాన కెమెరా ఇచ్చారు. 8ఎంపీ సెల్ఫీ కెమెరాతో వస్తోంది. దీంట్లో మీడియాటెక్ డైమెన్‌సిటీ 7060 ప్రాసెసర్ అమర్చారు. 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ 33W వైర్డ్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఆండ్రాయిడ్ 15తో వస్తున్న లావా బ్లేజ్ అమోలెడ్2.. ఆండ్రాయిడ్ 16 అప్‌డేట్ వరకు మాత్రమే వస్తుంది. సెక్యూరిటీ అప్‌డేట్స్ రెండేళ్ల వరకు కొనసాగుతాయి. ఈ ఫోన్ సింగిల్ వేరియంట్‌లో లభిస్తుంది. 6జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ. 13,499గా కంపెనీ నిర్ణయించింది. మిడ్‌నైట్ బ్లాక్, ఫీథర్ వైట్ కలర్స్‌లో లభిస్తుంది. ఈ ఫోన్ ఆగస్టు 16 నుంచి లావా రిటైల్ స్టోర్లతో పాటు అమెజాన్‌లో అందుబాటులోకి రానుంది.





## దిల్లీ- వాషింగ్టన్ డీసీ విమాన సర్వీసులు నిలిపివేత.. ఎయిరిండియా కీలక నిర్ణయం

**దిల్లీ:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. దిల్లీ వాషింగ్టన్ డీసీ మధ్య నాన్ స్టాప్ విమాన సర్వీసులను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది. ఆపరేషనల్ సంబంధిత పరిమితుల దృష్ట్యా ఈ రూట్‌లో సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. 26 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలకు రెట్రోఫిట్ చేపడుతున్నందున విమానాల కొరత ఉంటుందని, అలాగే, పాకిస్థాన్ గగనతలం మూసివేత ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిరిండియా పేర్కొంది. విమానాల కొరత కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. గత నెలలోనే బోయింగ్ 7878 విమానాలు రిట్రోఫిట్ చేయడం ప్రారంభించినట్లు పేర్కొంది. కస్టమర్ల ప్రయాణ అనుభవాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో చేపట్టిన ఈ విస్తృతమైన కార్యక్రమం వల్ల 2026 చివరి వరకు ఎప్పుడైనా కొన్ని విమానాలు అందుబాటులో ఉండకపోవచ్చని ప్రకటనలో తెలిపింది. దీంతో పాటు పాకిస్థాన్ మీదుగా గగనతలం మూసివేత కొనసాగుతుండటం వల్ల విమానాల సుదూర కార్యకలాపాలపై ప్రభావం పడుతోందని తెలిపింది. ఆపరేషనల్ సమస్యల నేపథ్యంలో ఈ విమానాల నిలిపివేత నిర్ణయం తీసుకున్నట్లు పునరుద్ఘాటించింది. సెప్టెంబర్ 1 తర్వాత వాషింగ్టన్ డీసీకి లేదా అక్కడి నుంచి దిల్లీకి టికెట్లు బుకింగ్ చేసుకున్న ప్రయాణికుల్ని సంప్రదించి.. వారి వ్యక్తిగత ప్రాధాన్యతల ప్రకారం ఇతర విమానాల్లో రీబుకింగ్ లేదా పూర్తి రిఫండ్ సహా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లను సైతం అందిస్తామని తెలిపింది.

# చైనాకు మళ్లీ పవర్‌ఫుల్ చిప్పులు.. లాభాల్లో ట్రంప్ సర్కారుకు 15% వాటా

అమెరికా నుంచి చైనాకు అత్యాధునిక కంప్యూటర్ చిప్‌లను ఎగుమతి చేసే విషయంలో కీలక ముందుడుగు పడింది. చైనాలో విక్రయాలపై తమకు వచ్చే లాభాల్లో ట్రంప్ సర్కారుకు వాటా చెల్లించేందుకు అమెరికన్ చిప్ కంపెనీలైన ఎన్విడియా, ఏఎండీ అంగీకరించాయి. దీంతో చిప్ ఎగుమతులు తిరిగి ప్రారంభం కానున్నాయి. భద్రతా కారణాలను చూపుతూ చిప్ ఎగుమతులను అమెరికా నిలిపివేయగా.. ప్రతిగా చైనా అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో లాభాల్లో వాటా తీసుకుని చిప్‌ల ఎగుమతికి అమెరికా ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం.
చైనాకు అత్యాధునిక చిప్‌లను ఎగుమతి చేయడంపై అమెరికా బైడెన్ హయాంలో ఆంక్షలు విధించింది. దీంతో చైనా మార్కెట్ కోసం ఎన్విడియా అత్యాధునిక హెచ్20 చిప్‌లను రూపొందించింది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక వాటిపైనా ఆంక్షలు విధించడంతో ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా ఎన్విడియా భారీగా ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఎన్విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ అటు వాషింగ్టన్‌తోనూ ఇటు బీజింగ్‌తోనూ లాబీయింగ్ జరిపారు. డొనాల్డ్ ట్రంప్‌తో గత వారం సమావేశం తర్వాత ఎన్విడియా చిప్‌ల ఎగుమతిపై కీలక ప్రకటన చేశారు.




చైనాలో ఎన్విడియా విక్రయించే హెచ్20 ఏఐ చిప్స్, ఏఎండీ విక్రయించే ఎంఐ 308 చిప్స్‌పై వచ్చే లాభాల్లో 15 శాతం వాటాను అమెరికా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. చైనాకు చిప్‌లు ఎగుమతి చేసేందుకు లైసెన్స్ పొందిన ఉత్పత్తులకు మాత్రమే లాభాల్లో వాటా చెల్లించే విధంగా ఇరు కంపెనీలూ ఒప్పందం చేసుకున్నాయి. అంతేకాదు రెండు కంపెనీలు తమ సేల్ రికార్డులను భద్రపరచడంతో పాటు వాటిని అమెరికా అధికారులతో ఎప్పటికప్పుడు పంచుకోవాలి. ఈ మొత్తాన్ని చిప్ రీసెర్చ్, టెక్నాలజీ సెక్యూరిటీకి వినియోగించనున్నారు.

**అందుకే దిగొచ్చిందా?**

అత్యాధునిక చిప్‌లను చైనా మిలిటరీ అవసరాల్లో వినియోగిస్తోందన్న భయం అమెరికాను వెంటాడింది. ఈ క్రమంలోనే ఆంక్షలు విధించింది. ఈ నిర్ణయం అమెరికా కంపెనీల ఆదాయానికి గండి కొట్టింది. దీంతో చైనాలోని ప్రత్యర్థి కంపెనీలకు ప్రయోజనం చేకూరుతుందని గ్రహించిన అగ్రరాజ్యం ఆంక్షలు సడలించింది. మరోవైపు ఇరు దేశాల మధ్య నెలకొన్న టారిఫ్ వార్‌కు 90 రోజుల బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు సడలించగా.. చిప్ ఎగుమతులకు ట్రంప్ సర్కార్ పచ్చజెండా ఊపింది.



## కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**దిల్లీ:** కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బైజయంత్ పాండా సారథ్యంలో 31 మంది సభ్యులతో కూడిన సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు నవీకరించిన బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టిన 3 నిమిషాలకే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. బిహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండడంతో దీనిపై చర్చకు తావు లేకుండా పోయింది. బిల్లు పాసైన అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది.

ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం1961 స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టింది. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలక్ట్ కమిటీకి పంపించింది. కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం.. ఆదాయపు పన్ను (నం.2) బిల్లు 2025ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గత శుక్రవారం పాత బిల్లును ఉపసంహరించుకున్నారు. సెలక్ట్ కమిటీ సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు మంత్రి వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు. లోక్‌సభ ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లు తదుపరి రాజ్యసభకు వెళ్లనుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో కొత్త చట్టంగా మారనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

**బిల్లులోని కీలక అంశాలు..**

పాత ఆదాయపు పన్ను చట్టంలో 'క్రితం సంవత్సరం' 'అసెస్‌మెంట్ ఇయర్' అనే పదాలు వాడుకలో ఉన్నాయి. కొత్త బిల్లులో వీటి స్థానే 'పన్ను సంవత్సరం' వినియోగంలోకి రానుంది.
2025 ఆదాయపు పన్ను బిల్లు కొత్త పన్నులేమీ విధించదు. ప్రస్తుతం ఉన్న పన్ను శ్లాబులు, రేట్లను మార్చదు. అలాగే ఐటీఆర్ ఫైలింగ్ గడువు తేదీలు, ఆదాయపు పన్ను శ్లాబులు, మూలధన లాభాల్లో ఎటువంటి మార్పులూ ఉండవు.
వేతనాల నుంచి డిడక్షన్ల విషయానికొస్తే అంటే స్టాండర్డ్ డిడక్షన్, గ్రాడ్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలు వేర్వేరు సెక్షన్లు, నిబంధనల కింద ఉన్నాయి. వీటిని ఒకే దగ్గరకు తీసుకొచ్చి పట్టిక రూపంలో కనిపిస్తాయి.

# కేటీఎమ్ కొత్త బైక్: ధర రూ.1.85 లక్షలు!

**ప్రముఖ వాహన తయారీ సంస్థ కేటీఎమ్ తన డ్యూక్ ఫ్యామిలీని ఎప్పటికప్పుడు విస్తరిస్తూనే ఉంది. ఇందులో భాగంగానే.. దేశీయ మార్కెట్లో కొత్త 'డ్యూక్ 160' లాంచ్ చేసింది. ఈ బైక్ ధర రూ.1.85 లక్షలు (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ). కంపెనీ దీని కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. డెలివరీలు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.**

**కేటీఎమ్ డ్యూక్ 125 స్థానంలో లాంచ్ అయిన డ్యూక్ 160 బైక్ 164.2 సీసీ సింగిల్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ పొందుతుంది. ఇది 9500 rpm వద్ద, 19 bhp పవర్, 7500 rpm వద్ద 15.5 Nm టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇంజిన్ ఆరు-స్పీడ్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది.**

**కొత్త కేటీఎమ్ 160 బైకులోని చాలా భాగాలు కేటీఎమ్ 200 డ్యూక్‌ని పోలి ఉంటాయి. దీని ముందు భాగంలో అప్‌సైడ్-డౌన్ ఫోర్క్‌లు, వెనుక భాగంలో ప్రీలోడ్-సర్దుబాటు చేయగల మోనోషాక్ ఉన్నాయి. బ్రేకింగ్ విషయానికి వస్తే.. ఈ బైక్ ముందు భాగంలో 320 మిమీ ఫ్రంట్ డిస్క్, వెనుక 230 మిమీ డిస్క్ ఉన్నాయి. డ్యూయెల్ ఛానల్ ఏబీఎస్ కూడా ఇందులో ఉంటుంది.**

**ఫీచర్స్ విషయానికి వస్తే.. కేటీఎమ్ 160 డ్యూక్ బైకులో కేటీఎమ్ కనెక్ట్ యాప్‌తో బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్-బై-టర్న్ నావిగేషన్ & కాల్/మ్యూజిక్ కంట్రోల్ వంటి వాటితో పాటు.. LCD ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ కూడా ఉంది. ఈ బైక్ ఎలక్ట్రానిక్ ఆరెంజ్, అట్లాంటిక్ బ్లూ & సిల్వర్ మెటాలిక్ మాట్టే అనే మూడు కలర్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది.**



# ఆ గెలుపు నాగ్ దే. టాలీవుడ్ చరిత్రలో తొలిసారి!



అక్కినేని నాగార్జున అకస్మాత్తుగా అన్ని సోషల్ మీడియా వేదికలపైనా వైరల్‌గా మారారు. దీనికి కారణం ఆయన తాజాగా నటించిన కూలీ సినిమా.. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమా ఇప్పటికే టీజర్ లాంచ్ అయి సూపర్ డూపర్ హిట్ అంచనాలను అందుకుంది. మరీ ముఖ్యంగా ఈ టీజర్‌లో నాగార్జున లుక్ బాగా క్లిక్ అయింది. నాగార్జున తన సినీ జీవితంలో తొలిసారిగా విలన్ గా నటిస్తుండడం దక్షిణాది ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేకెత్తిస్తోంది. అందుకు తగ్గట్టే నాగార్జున రోల్ అత్యంత స్టైలిష్‌గా తీర్చిదిద్దినట్టు తెలుస్తుండడం కూడా నాగ్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచేసింది. నిజానికి ఈ సినిమా లో విలన్ పాత్ర ను ఎంచుకో- వడం పట్ల మొదట్లో నాగ్ ఫ్యాన్స్ కొంత ఇబ్బంది పడ్డారనేది నిర్వివాదం. అయితే తాజా అప్ డేట్స్‌తో వారిలో కూడా ఫుల్ జోష్ కనిపిస్తోంది.

ప్రీ రిలీజ్ వేడుకలో నాగార్జున తన వయసులో సగం తగ్గిపోయినట్టు కనపడ్డారు. అంతేకాకుండా లోకేష్ కనగరాజ్ తన పాత్రను అద్భుతంగా తీర్చిది- ద్దారని నాగ్ స్వయంగా చెప్పడం, తాను నాగార్జున అభిమానినని లోకేష్ అనడం... కూడా అభిమాను- ల్లో ఉత్సాహం నింపింది. ప్రీ రిలీజ్‌లో నాగ్ లుక్, ఆయన మాటలు ఆయన గురించి తలైవా రజనీ కాంత్ పొగడ్తలు... సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ముఖ్యంగా టీజర్‌లో నాగా- ర్జున తన హెయిర్‌ని కుడి చేత్తో వెనక్కి తోస్తున్న బిట్‌ను ఫ్యాన్స్ తెగ వైరల్ చేస్తున్నారు. ఏతావాతా కూలీ సినిమా విడుదలకు ముందే ఒక విషయం మాత్రం రూఢీ అయిపోతోంది. ఈ సినిమాలో నాగార్జున పాత్ర అనూహ్యంగా ఉండబోతోందని. రజనీకాంత్ లాంటి వీర మాస్ హీరోకి సమ ఉజ్జీగా ఆయన తెరపై విలన్ రోల్‌లో దుమ్మురేపనున్నారని.

ఈ నేపథ్యంలో మరోసారి సీనియర్ హీరోల పాత్రల ఎంపిక ప్రస్తావనకు వస్తోంది. ప్రస్తుతం నాగార్జునతో పాటు ఆయన సమకాలీకులు ఒకనాటి అగ్ర హీరోలు ముగ్గురు ఇంకా ఫుల్ యాక్టివ్‌గా ఉన్న విషయం తెలిసిందే. అయితే వీరెవరూ సాహసించని రీతిలో నాగార్జున తన పాత్రల ఎంపికను అమాంతం మార్చుకుని ఈ విషయంలో అందర్నీ దాటేశారు. సీనియర్ హీరోల్లో నాగార్జున గ్లామర్‌తో పోటీపడే వారు ఎవరూ లేరనేది నిజం. అయినప్పటికీ వయసుకు తగ్గట్టుగా మార్పు చేర్పులు చేసుకుంటున్నారు.

కుబేర సినిమాలో డీ గ్లామర్ రోల్ పోషించి, కూలీ లో ఏకంగా విలన్ పాత్రకు కూడా సై అనడం ద్వారా ఒక నటుడికి సినిమా కలెక్షన్లు, ఇమేజ్‌లు మాత్రమే కాదు వైవిధ్య భరిత పాత్రల్లో నటించానన్న తృప్తి కూడా చాలా అవసరమని చెప్పకనే చెప్పారు. నిన్నే పెళ్లాడుతా తో గ్రీకు వీరుడి ఇమేజ్ తెచ్చుకు- ని వెంటనే అన్నమయ్య లాంటి పాత్ర చేసిన నాటి దమ్మూ ధైర్యం, తెగువనే ఇప్పటికీ చూపిస్తున్నారు నాగార్జున. అందుకే.. టాలీవుడ్ చరిత్ర లో తొ- లిసారిగా... సినిమా విడుదల కాకముందే జనం మనసులు గెలిచిన విలన్ అనిపించుకుంటున్నారు.

# ఇలాంటి చెత్త సినిమాలు ఎందుకు చేస్తారని అడుగుతుంటారు: అనుపమ



తాను నటించిన 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా వివాదంపై అనుపమ పరమేశ్వరన్ తాజాగా స్పందించారు. ఆ సినిమాలో తనకు తెలియకుండా మార్పులు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. తన మరో కొత్త సినిమా 'పరదా' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "జానకి పేరును ప్రధాన పాత్రతో పాటు టైటిల్‌కి పెట్టడం వల్ల వివాదం తలెత్తింది. దాన్ని నేను అంగీకరించను. ఎంతోమంది దేవుళ్లు/దేవతలు ఉన్నారు. మనలో చాలామంది పేర్లు దేవుడి పేరుతో ముడిపడినవే. మా నాన్న పేరు పరమేశ్వరన్. శివుడిని సంహారమూర్తి అంటారు కదా. మరి, మా నాన్న అలా చేస్తారా? జానకి దేవి గురించి తప్పుగా చిత్రీకరించినప్పుడు అభ్యంతరం వ్యక్తం చేయొచ్చు. కానీ, దేవుడి పేరుని పాత్రకో, సినిమాకో పెట్టడాన్ని వ్యతిరేకించడం సరికాదు"

"న్యాయం కోసం పోరాడే యువతి జానకి కథ ఇది. నటించేందుకు నేను అంగీకరించిన సమయంలో అంత వరకే నాకు తెలుసు. ఆ తర్వాత మార్పులు చోటుచేసుకున్నాయి. 'సినిమాని నాకు చూపించకపోతే నేను ప్రమోట్ చేయను' అని చెప్పా. ఎందుకంటే అందులో ఏముందో నాకు తెలియాలి కదా. చాలా సినిమాల విషయంలో ఇలాగే జరుగుతుంటుంది. మేం అంగీకరించిన స్క్రిప్టు.. సినిమా పూర్తయ్యేలోగా మారిపోతుంటుంది. ఇవన్నీ తెలియదు కాబట్టి 'ఎందుకు ఇలాంటి చెత్త సినిమాలు చేస్తారు' అని కొందరు అడుగుతుంటారు. కథే కాదు పాత్రల విషయంలోనూ అంతే" అని పేర్కొన్నారు. 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' విషయంలో సెన్సార్ బోర్డు అభ్యంతరం తెలిపిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు జులై 17న బాక్సాఫీసు ముందుకొచ్చింది. ఈ నెల 15 నుంచి ఓటీటీ 'జీ 5'లో స్ట్రీమింగ్ కానుంది.

'పరదా' సినిమా షూటింగ్ రోజులు గుర్తుచేసుకుంటూ.. "ఓ రోజు బ్రిడ్జిపై చిత్రీకరణ జరుగుతోంది. నేను కిందపడాల్సిన సన్నివేశమది. అదే సమయంలో కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక నేను కిందపడ్డా. ఆ విషయం తెలియని చిత్ర బృందం బాగా నటిస్తున్నానని అనుకుంది. తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లారు" అని చెప్పారు. దర్శకుడు ప్రవీణ్ కంద్రేగుల తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది.

# డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఠాకుర్ క్లారిటీ



సినిమా ఇండస్ట్రీలో హీరోహీరోయిన్లు గురించి ఎప్పటికప్పుడు ఏదో ఒక రూమర్ వినిపిస్తూనే ఉంటుంది. కొన్నిసార్లు లైట్ తీసుకునేలా ఉంటాయి. కొన్నిసార్లు మాత్రం నిజమేనేమో అనిపిస్తాయి. కొన్నిరోజుల క్రితం అలా.. ధనుష్-మృణాల్ డేటింగ్‌లో ఉన్నారనే ఓ రూమర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఒకటి రెండు వీడియోలు కూడా వైరల్ కావడంతో ఇది నిజమేనని అందరూ అనుకున్నారు.

అయితే ఈ డేటింగ్ పుకార్లకు బలం చేకూర్చేలా కొన్ని విషయాలు కనిపించాయి. ధనుష్ ప్రస్తుతం భార్య నుంచి విడాకులు తీసుకుని సింగిల్‌గానే ఉంటున్నాడు. అలాంటిది మృణాల్.. రీసెంట్‌గా జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీమియర్‌లో ధనుష్‌తో చనువుగా కనిపించడం, అలానే ధనుష్ అక్కలు ఇద్దర్ని ఇన్ స్టాలో మృణాల్ ఫాలో అవుతుండటం లాంటివి చూసి డేటింగ్ నిజమని అందరూ భావించారు.
ఇప్పుడు ఈ విషయమై స్వయంగా మృణాల్ ఠాకుర్ స్పందించింది. అసలెం జరిగిందో చెప్పుకొచ్చింది. 'ధనుష్ నాకు మంచి ఫ్రెండ్ మాత్రమే. ఈ రూమర్స్ గురించి నాకు కూడా తెలుసు. నిజం చెప్పాలంటే అవి చాలా ఫన్నీగా అనిపించాయి. 'సన్ ఆఫ్ సర్దార్ 2' ఈవెంట్‌కి ఆయన రావడాన్ని అందరూ తప్పుగా అర్థం చేసుకున్నారు. ధనుష్-అజయ్ దేవగణ్ క్లోజ్ ఫ్రెండ్స్. అజయ్ పిలిస్తేనే ధనుష్.. ఆ కార్యక్రమానికి వచ్చాడు. మా ఇద్దరం కలిసి కనిపించినంత మాత్రాన మా మధ్య ఏదో జరుగుతున్నట్లు కాదు' అని మృణాల్ చెప్పుకొచ్చింది.

సీరియల్స్ నుంచి సినిమా హీరోయిన్‌గా మారిన మృణాల్.. 'సీతారామం' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత 'హాయ్ నాన్న'తో మరో సక్సెస్ అందుకుంది. కానీ విజయ్ దేవరకొండతో చేసిన 'ఫ్యామిలీ స్టార్' ఫ్లాప్ అయింది. అప్పటినుంచి హిందీలోనే వరస సినిమాలు చేస్తోంది. కానీ అన్నీ ఫెయిల్ అవుతూ వస్తున్నాయి. లేటెస్ట్‌గా వచ్చిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' కూడా ఫ్లాప్ అయింది.

# ఈ ఏడాది నాకెన్నో పాఠాలు నేర్పింది.. విడాకుల రూమర్స్ వేళ హన్సిక పోస్ట్



**నటి హన్సిక విడాకులు తీసుకోనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె ఇన్‌స్టా స్టోరీలో పెట్టిన నోట్ వైరల్‌గా మారింది. తాజాగా పుట్టినరోజు వేడుకలు చేసుకున్న ఆమె ఈ ఏడాది తనకు ఎన్నో పాఠాలు నేర్పిందని అన్నారు.**

2025 గురించి చెబుతూ "ఈ సంవత్సరం నేను అడగకుండానే ఎన్నో పాఠాలు నేర్పింది. నాలో నాకు తెలియనంత బలం ఉందని తెలిసేలా చేసింది. ఈ పుట్టినరోజున మీ అందరి శుభాకాంక్షలతో నా హృదయం ఉప్పొంగిపోతోంది. చాలా ప్రశాంతంగా ఉంది. ఒక్కోసారి చిన్న విషయాలు కూడా ఎంతో ఆనందాన్నిస్తాయి. ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని నోట్ రాశారు. దీంతో ఆమెపై వస్తోన్న రూమర్స్ మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

2022 డిసెంబర్‌లో హన్సిక తన ప్రియుడు సోహైల్‌ను వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. అయితే హన్సిక, సోహైల్ విడివిడిగా ఉంటున్నట్లు కొన్ని రోజులుగా టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలను సోహైల్ ఖండించినప్పటికీ హన్సిక మాత్రం ఇప్పటివరకూ మౌనంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె తన సోషల్ మీడియా నుంచి పెళ్లి ఫొటోలు డిలీట్ చేయడంతో వీటికి మరింత బలం చేకూరింది. ప్రస్తుతం హన్సిక 'శ్రీ గాంధారి'లో నటిస్తున్నారు. ఆర్.కన్నన్ దర్శకత్వంలో ఇది రానుంది.



# కపిల్ శర్మ టార్గెట్‌గా కాల్పులు.. ఇంటి వద్ద భారీ భద్రత!

బాలీవుడ్ స్టార్ కమెడియన్ కపిల్ శర్మకు భారీగా భద్రతను పెంచారు. ఇటీవల మరోసారి కెనడాలోని ఆయన కేఫ్‌పై కాల్పులు జరగడంతో ముంబయి పోలీసులు చర్యలు చేపట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా కపిల్ శర్మ ఇంటి వద్ద భద్రత ఏర్పాటు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు.

కాగా.. ఆగస్టు 8న కెనడాలోని సర్రేలో ఉన్న కపిల్ శర్మ ఇటీవల ప్రారంభించిన రెస్టారెంట్ కాప్స్ కేఫ్‌పై కాల్పులు జరిగాయి. నెలలోపే ఇది రెండవ ఘటన కావడం ఆందోళనకు గురి చేస్తోంది. గతంలోనే జూలై 10న ఇదే తరహాలో దాడి జరిగింది. కపిల్ శర్మను లక్ష్యంగా చేసుకుని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఈ దాడులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

రెండోసారి దాడి తర్వాత బిష్ణోయ్ సన్నిహితుడు హ్యారీ బాక్సర్ నుంచి ఆడియో సందేశం వచ్చినట్లు తెలుస్తోంది. కపిల్ శర్మ నెట్‌ఫ్లిక్స్ షో ప్రీమియర్‌లో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ కనిపించడమే దీనిని కారణమని ఆడియో సందేశంలో పేర్కొన్నారు. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే వారిని బిష్ణోయ్ గ్యాంగ్ లక్ష్యంగా పని చేస్తుందని ఆడియోలో వార్నింగ్ ఇచ్చారు. దీంతో ముంబయి పోలీసులు ఓషివారాలోని కపిల్ శర్మ నివాసాన్ని సందర్శించి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు.



# ప్రభుత్వ వాహనం ఏర్పాటులో నా పాత్ర లేదు: నిధి అగర్వాల్

ఏపీ ప్రభుత్వ వాహనంలో తాను ఈవెంట్‌కు వెళ్లడంపై హీరోయిన్ నిధి అగర్వాల్ స్పందించింది. ఈ వాహనాన్ని కావాలని తాను అడగలేదని తన నోట్‌లో రాసుకొచ్చింది. ఈవెంట్ నిర్వాహకులు ఆ కారును తన కోసం పంపారని ట్విట్టర్‌లో లేఖను పోస్ట్ చేసింది. ప్రభుత్వ వాహనం ఏర్పాటులో తన ప్రమేయం ఏమాత్రం లేదని నిధి అగర్వాల్ తెలిపింది.

కాగా.. ఏపీలోని భీమవరంలో ఓ నగల దుకాణం ప్రారంభోత్సవానికి వెళ్లిన నిధి అగర్వాల్.. ప్రభుత్వ వాహనంలో వెళ్తూ కనిపించింది. ఈ వీడియోలు కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కూటమి ప్రభుత్వంపై నెట్టింట పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. అయితే ఇందులో నిధి పాత్ర లేకపోయినప్పటికీ.. ప్రభుత్వ వాహనం ప్రైవేట్ ఈవెంట్ ఆర్గనెజర్స్ ఏర్పాటు చేయడంపై నెటిజన్స్ మండిపడుతున్నారు. అసలు ప్రైవేట్ ఈవెంట్ ఆర్గనైజర్స్ వద్ద ప్రభుత్వ వాహనం ఎలా ఉందని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వాహనాలను ఏకంగా రెంట్‌కి ఇచ్చారా? అని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు నిధి అగర్వాల్ ఇటీవలే పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లులో హీరోయిన్‌గా నటించింది.

# సిరాజ్ ఏం తింటాడో.. ఏం తాగుతాడో తెలుసుకోవాలని ఉంది: ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్



టీమ్ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ డేవిడ్ గోవర్ ప్రశంసల వర్షం కురిపించాడు. అతడి ఫిట్‌నెస్‌కు ఫిదా అయిపోయాడు. ఇంగ్లాండ్ సిరీస్‌లో భారతజట్టు తరఫున సిరాజ్ కీలకంగా వ్యవహరించాడు. టీమ్ఇండియా ఈ సిరీస్‌ను 22తో సమం చేయడంలో తన వంతు పాత్ర పోషించాడు. మొత్తంగా 23 వికెట్లతో.. అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. అలాగే రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శనా చేశాడు. ఈ క్రమంలో అతడు ఏకంగా 185.3 ఓవర్లు (1113 బంతులు) బౌలింగ్ చేశాడు. ముఖ్యంగా ఓవల్‌లో జరిగిన చివరి టెస్ట్ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. 374 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్‌ను 367కే కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ఈ సిరీస్‌లో టీమ్ఇండియా తరఫున అయిదుకు అయిదు మ్యాచుల్లో ఆడిన ఏకైక బౌలర్‌గా సిరాజ్ నిలిచాడు. ఈ విషయమై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ డేవిడ్ గోవర్.. అతణ్ని కొనియాడాడు. 'నేను.. సిరాజ్ ఏం తీసుకుంటాడో.. అంటే అతడు ఏం తింటాడో? ఏం తాగుతాడో తెలుసుకోవాలనుకుంటున్నాను. ఎందుకంటే.. నేను వాటిని ఇంగ్లాండ్ బౌలర్లకు అందించాలనుకుంటున్నా. అతడు ఈ సిరీస్‌లో విశ్రాంతి తీసుకోకుండా అయిదు టెస్ట్ మ్యాచుల్లోనూ ఆడాడు. ముఖ్యంగా రెండో ఇన్నింగ్స్‌లో 30 ఓవర్లపాటు బౌలింగ్ వేశాడు. అతడు అస్సలు తగ్గలేదు. కనీసం అలసిపోయినట్లు కూడా కనిపించలేదు' అని డేవిడ్ గోవర్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

అలాగే సిరాజ్ ఫిట్‌నెస్‌ను కూడా ప్రశంసించాడు. 'గెలవాలనే దృఢ సంకల్పం, ఫిట్‌నెస్ విషయంలో సిరాజ్ మేటిగా నిలిచాడు. ఇంగ్లాంగ్ బౌలింగ్ దళం మాత్రం కొన్ని సంవత్సరాలుగా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతోంది. సిరాజ్ అలవోకగా.. అయిదుకు అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఇది నిజంగా అద్భుతం' అని డేవిడ్ గోవర్ విశ్లేషించాడు.



# లోక్‌సభ ఆమోదం.. ఇందులో ఏముంది?

జాతీయ క్రీడా పరిపాలనా బిల్లు2025కి లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. అదే విధంగా.. జాతీయ యాంటీడోపింగ్ (సవరణ) బిల్లుకు కూడా ఈరోజే ఆమోదం లభించింది. అయితే, విపక్షాలు మాత్రం ఇందుకు సహకరించలేదు. అయినప్పటికీ నిరసనల నడుమే క్రీడా పరిపాలనా బిల్లుకు ఆమోదం లభించింది.

**అతిపెద్ద సంస్కరణ ఇది**

ఈ సందర్భంగా కేంద్ర క్రీడా శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ సభలో మాట్లాడుతూ.. ''స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత క్రీడా రంగంలో ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ ఇది. జవాబుదారీతనం తీసుకురావడం ద్వారా ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరుతుంది. క్రీడా సమాఖ్యలన్నీ అత్యుత్తమంగా పరిపాలన చేసేందుకు ఇది తోడ్పడుతుంది'' అని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌లో దీనికి అత్యంత ప్రాముఖ్యత ఉంటుందన్న మాండవీయ.. దురదృష్టవశాత్తూ ప్రతిపక్షాలు ఈ బిల్లు ఆమోదంలో పాలు పంచుకోలేకపోయాయన్నారు. ''1975లో మేము ఈ బిల్లుకు సంబంధించి తొలి డ్రాఫ్ట్ తయారుచేశాము. కానీ క్రీడలు కూడా వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజకీయ రంగు పులుముకున్న కారణంగా ఇది సాధ్యం కాలేదు.

అయితే, కొంతమంది మంత్రులు ఈ బిల్లును ప్రవేశపెట్టగలిగారు కానీ.. దీనికి ఆమోదం లభించేలా చేయలేకపోయారు. 2011లో మనకు జాతీయ స్పోర్ట్స్ కోడ్ వచ్చింది. దానిని బిల్లుగా మార్చేందుకు మేము కృషి చేశాం.

అనంతరం క్యాబినెట్‌లో చర్చల్లో భాగంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందుకే ఇది పార్లమెంట్ వరకు చేరుకోలేకపోయింది. ఏదేమైనా నేనషల్ స్పోర్ట్స్ బిల్ గవర్నెన్స్ బిల్ ఒక సంచలనాత్మక మార్పునకు నాంది.

అతి పెద్దదైన మన దేశంలో ఒలింపిక్స్‌లో, అంతర్జాతీయ స్థాయిలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం నిజంగా విచారకరం. క్రీడా రంగ సామర్థ్యాన్ని పెంచడానికి ఈ బిల్లు దోహదం చేస్తుంది'' అని మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు.

**ఇందులో ఏముంది?**

కాగా క్రీడా సంస్థలకు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే వీలు కల్పించడం నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు ద్వారా సాధ్యమవుతుంది. రాజకీయ ఒత్తిడి, జోక్యం ఉండదని చెబుతున్నారు. స్పోర్ట్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు ద్వారా.. అథ్లెట్లు, ఆఫీస్ బేరర్లు, క్రీడా సమాఖ్యల మధ్య తగాదాలను త్వరితగతిన పరిష్కరించే వీలుంటుంది. ప్రతిభ ఆధారంగా మాత్రమే ఆటగాళ్ల ఎంపిక ఉండేలా చూసుకుంటారు.

జాతీయ క్రీడా సమాఖ్యలకు సంబంధించిన ఆడిట్లు సకాలంలో పూర్తి చేయడంతో పాటు.. నిధుల వినియోగానికి సంబంధించి పారదర్శకత ఉండేందుకు ఇది దోహదం చేస్తుంది. క్రీడా పరిపాలనా విభాగాన్ని మెరుగుపరచి, ఎవరి పాత్ర ఏమిటన్న అంశాలపై స్పష్టతనివ్వడం ద్వారా ఒలింపిక్స్ వంటి హై ప్రొఫైల్ ఈవెంట్లు నిర్వహించడం కాస్త సులువుగా మారుతుంది.

అయితే, అన్నింటికీ మించి ఆటగాళ్లకు సురక్షిత వాతావరణం కల్పించడం.. అంటే.. అన్ని రకాల వేధింపుల నుంచి ఉపశమనం కలిగించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం.

**బీసీసీఐకి రిలీఫ్**

ఇదిలా ఉంటే.. భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI)కి మాత్రం ఈ బిల్లులో ఉపశమనం లభించింది. బోర్డు వ్యవహారాల గురించి ఆర్టీఐ నుంచి సమాచారం కోరేందుకు మాత్రం అనుమతి ఉండదు. బీసీసీఐ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం తీసుకోవడం లేదు.. కాబట్టి అందుకే ఈ మేరకు మినహాయింపు ఇచ్చారని సమాచారం.

అదే విధంగా.. అడ్మినిస్ట్రేటర్లకు ఏజ్ రిలాక్సేషన్ ఇచ్చారు. ఇంటర్నేషనల్ బాడీ అనుమతించినట్లయితే.. 70 75 ఏళ్ల వ్యక్తులు కూడా క్రీడా సమాఖ్యల ఎన్నికల్లో పాల్గొనవచ్చు.

# కష్టాల్లో క్లబ్ ఫుట్‌బాల్!

**అనిశ్చితిని అధిగమిస్తేనే మెరుగైన ఫలితాలు**

**సమష్టి కృషితోనే ఐఎస్ఎల్ భవితవ్యం**

**ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే వెల్లడి**



**న్యూఢిల్లీ:** దేశంలోని అగ్రశ్రేణి ఫుట్‌బాల్ టోర్నమెంట్... ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) భవిష్యత్తుపై అనిశ్చితి కారణంగా క్లబ్ ఫుట్‌బాల్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అఖిల భారత ఫుట్‌బాట్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధ్యక్షుడు కల్యాణ్ చౌబే అన్నారు. ఈ కఠిన పరిస్థితులను అధిగమించడానికి సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. 2010లో ఏఐఎఫ్ఎఫ్ చేసుకున్న మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్ (ఎంఆర్ఏ) పునరుద్ధరణపై అనిశ్చితి కారణంగా 2025-26 ఐఎస్ఎల్ సీజన్‌ను నిలిపేయాల్సి వచ్చింది.

లీగ్ నిర్వాహకుల నిర్ణయం అనంతరం ఐఎస్ఎల్‌లోని మూడు క్లబ్‌లు తమ జట్టు కార్యకలాపాలను ఆపేశాయి. ఇందులో భాగంగా ఆటగాళ్లు, సిబ్బందికి వేతనాలు సైతం నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో కల్యాణ్ చౌబే మాట్లాడుతూ... 'సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామన్నది నిజమే. స్వార్థ ప్రయోజనాలతో కొంతమంది ఈ పరిస్థితిని సృష్టించారు. అయితే సమష్టి కృషితోనే దీన్ని దాటి ముందుకు సాగగలమనే నమ్మకముంది' అని 1999 నుంచి 2006 వరకు భారత సీనియర్ జట్టుకు గోల్‌కీపర్‌గా వ్యవహరించిన కల్యాణ్ చౌబే అన్నారు.

**క్లబ్ సీఈవోలతో చర్చలు విఫలం**

భారత ఫుట్‌బాల్‌లోని ప్రస్తుత పరిస్థితిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురావాలని ఐఎస్ఎల్‌లోని 11 క్లబ్‌లు కోరడంపై కల్యాణ్ చౌబే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏఐఎఫ్ఎఫ్ తమ అభ్యర్థనపై చర్య తీసుకోకపోతే స్వతంత్రంగా న్యాయ సహాయం కోరడం తప్ప తమకు వేరే మార్గం లేదని ఐఎస్ఎల్ క్లబ్‌లు ఒక లేఖలో పేర్కొన్నాయి. మొత్తం 13 క్లబ్‌లలో మోహన్ బగాన్ సూపర్ జెయింట్, ఈస్ట్ బెంగాల్ మినహా మిగిలిన 11 జట్లు దానిపై సంతకం చేశాయి. క్లబ్ సీఈవోలతో చర్చించిన మరుసటి రోజే ఈ లేఖ వెలుగు చూడటం ఆశ్చర్యపరిచిందని కల్యాణ్ అన్నారు.

'ఈనెల 7న ఢిల్లీలో 13 క్లబ్‌ల సీఈవోలతో జరిగిన సమావేశంలో అనేక అంశాలపై చర్చించాం. అయితే మరుసటి రోజే 11 క్లబ్‌లు లేఖ రాయడం ఆశ్చర్యం కలిగించింది. ఈ సమాచార లోపాన్ని నివారించి ఉండాల్సింది. ఏదేమైనా దేశంలో ఫుట్‌బాల్ అభివృద్ధికి ఏఐఎఫ్ఎఫ్ కట్టుబడి ఉంది. ఆటకు ఏది మంచిదో అది చేసేందుకు సదా సిద్ధంగా ఉంటాం. దీనిపై న్యాయ సలహా తీసుకునే ఆలోచనలో ఉన్నాం. ఆ తర్వాత తిరిగి క్లబ్‌ల సీఈవోలతో భేటీ అవుతాం.

ఈ నెల 17 తర్వాత మరోసారి సమావేశమవుతాం. క్లబ్‌ల ఆదాయ మార్గాలు పెంపొందించేందుకు ప్రణాళికలు రచించే అంశాన్ని సైతం పరిశీలిస్తున్నాం. తక్షణం తీసుకోవాల్సిన చర్యలతో కూడిన 5 అంశాల అజెండాను రూపొందిస్తున్నాం' అని ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు పేర్కొన్నారు.

**సొంతంగా ఐఎస్ఎల్ సాధ్యమా..**

మాస్టర్స్ రైట్స్ అగ్రిమెంట్ పునరుద్ధరణ అంశంలో అనిశ్చితి నెలకొనడంతో... ఐఎస్ఎల్ లీగ్‌ను సొంతంగా నిర్వహించే అంశాన్ని కూడా ఏఐఎఫ్ఎఫ్ పరిశీలిస్తోంది. 'ప్రస్తుతానికి అలాంటి ప్రతిపాదనేం లేదు. అయితే అన్ని దారులు తెరిచే ఉన్నాయి. వాటాదారులతో చర్చిస్తున్నాం. ఎంఆర్ఏ పునరుద్ధరణ అంశంలో ఆలస్యం జరిగింది. దేశంలో ఫుట్‌బాల్ అభివృద్ధి కోసం ఎలాంటి సమావేశానికి అయినా ఫుట్‌బాల్ సమాఖ్య సదా సిద్ధంగా ఉంటుంది. ఐఎస్ఎల్‌తో దేశంలో ఫుట్‌బాల్ మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయనేది ముమ్మాటికి నిజం.

మైదానాలు, ఆటగాళ్ల జీతాలు, విదేశీ ప్లేయర్ల సూచనలు, ప్రముఖ కోచ్‌ల మార్గనిర్దేశం, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం, సినీ రంగ ప్రముఖుల ప్రమేయం ఇలా అన్నీ అంశాల్లో భారత ఫుట్‌బాల్‌లో గణనీయమైన మార్పుకు ఈ లీగ్ కారణమైంది. దీంతో భారత ఫుట్‌బాల్ బ్రాండ్ విలువ పెరిగింది. ఈ సహకారం ఇలాగే కొనసాగుతూ... యువ నైపుణ్యాన్ని సరైన పద్ధతిలో వినియోగిస్తే వచ్చే పదేళ్లలో భారత జాతీయ జట్టు ర్యాంకింగ్ మెరుగవడం ఖాయమే' అని 48 ఏళ్ల కల్యాణ్ అన్నారు.

**ర్యాంకింగ్స్‌లో మెరుగవ్వాలంటే...**

గత నెల విడుదల చేసిన 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల జట్టు 133వ స్థానంలో నిలిచింది. తొమ్మిదేళ్లలో మన జట్టుకు ఇదే అత్యల్ప ర్యాంకు. ఇటీవలి కాలంలో టీమిండియా పేలవ ప్రదర్శన చేస్తుండటంతో ఆరు స్థానాలు కోల్పోవాల్సి వచ్చింది. దీనిపై కల్యాణ్ స్పందిస్తూ... 'అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన కనబరిస్తేనే ర్యాంకింగ్స్‌లో పురోగతి ఉంటుంది. అయితే ఈ ర్యాంకింగ్ విధానం కూడా కాస్త సంక్లిష్టమైంది. ఆడిన మ్యాచ్‌లు, ప్రత్యర్థి ర్యాంక్‌ల ఆధారంగా దీన్ని లెక్కిస్తారు.


2023లో ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడిగా బాధ్యతలు అందుకున్న సమయంలో మన జట్టు 106వ ర్యాంక్ నుంచి 99వ స్థానానికి చేరింది. ఇప్పుడు రెండేళ్ల తర్వాత 133వ ర్యాంక్‌లో నిలిచింది. ఆస్ట్రేలియా, ఉజ్బెకిస్తాన్ వంటి బలమైన జట్ల చేతిలో ఓడటంతో ర్యాంకింగ్స్‌పై అధిక ప్రభావం చూపింది. అయితే ఆటగాళ్లపై విశ్వాసం కోల్పోము. సీఏఎఫ్ఏ నేషన్స్ కప్, ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో మన జట్టు మెరుగైన ఆటతీరు కనబరుస్తుందనే నమ్మకముంది.

'ఫిఫా' ర్యాంకింగ్స్ వ్యవస్థ ప్రవేశపెట్టిన సమయంలో భారత్ 143వ ర్యాంక్‌తో ప్రారంభించింది. ఆ తర్వాత అత్యల్పంగా 173వ స్థానానికి పడిపోయింది. 1996లో అత్యుత్తమంగా 94వ ర్యాంక్‌లో నిలిచింది. ఐఎస్ఎల్ ద్వారా దేశంలో క్లబ్ క్రికెట్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. ఆసియాలో అత్యధిక మంది వీక్షించిన ఫుట్‌బాల్ టోర్నీ ఐఎస్ఎల్‌నే. జాతీయ అంతర్జాతీయ సంస్థలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. అయితే ఐఎస్ఎల్ ఫలాలు జాతీయ జట్టుకు అందడం లేదు. కానీ కష్టం ఎప్పటికే వృథా పోదు. దాని ప్రభావం టీమిండియాపై కనిపించే రోజులు ఎక్కువ దూరంలో లేవు' అని కల్యాణ్ వివరించారు.

# బుమ్రా అన్ని మ్యాచ్‌లూ ఆడి ఉంటే.. టీమ్ఇండియా తప్పకుండా సిరీస్ గెలిచేది: వెంగ్‌సర్కార్

**తెందూల్కర్- అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్, టీమ్ఇండియా మధ్య అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జరిగింది. భారత్ ఈ సిరీస్‌ను 2-2తో సమం చేసుకోగలిగింది. వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్‌ప్రీత్ బుమ్రా కేవలం మూడు టెస్ట్‌లు మాత్రమే ఆడగలిగాడు. ఈ మ్యాచుల్లో 14 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే రెండుసార్లు అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అయితే దురదృష్టవశాత్తు ఆ మ్యాచుల్లో టీమ్ఇండియా ఓటమి చవిచూసింది.**





బుమ్రా అన్ని మ్యాచ్‌లూ ఆడి ఉంటే.. టీమ్ఇండియా కచ్చితంగా సిరీస్‌ను కైవసం చేసుకొని ఉండేదని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ అన్నాడు. 'ఐపీఎల్‌లో చేసిన పరుగులు, తీసుకున్న వికెట్లు ఎవరు గుర్తుపెట్టుకుంటారు. జనాలు.. ఈ టెస్ట్ సిరీస్‌లో మహమ్మద్ సిరాజ్ పోరాట పటిమను అస్సలు మరిచిపోరు. అలాగే శుభ్‌మన్ గిల్ , కేఎల్ రాహుల్ , యశస్వి జైస్వాల్ , రిషభ్‌పంత్ బ్యాటింగ్‌ను, వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్ ప్రదర్శనను అందరూ గుర్తుపెట్టుకుంటారు. బుమ్రా అన్ని టెస్ట్ మ్యాచ్‌లు ఆడి ఉంటే.. టీమ్ఇండియా కచ్చితంగా ఈ సిరీస్‌ను కైవసం చేసుకుని ఉండేది' అని దిలీప్ వెంగ్‌సర్కార్ విశ్లేషించాడు.

తానే టీమ్ఇండియా చీఫ్ సెలెక్టర్ అయితే.. బుమ్రా విషయంతో అతడి ప్రణాళిక ఎలా ఉండేదో వివరించాడు. 'నేను ఒక వేళ టీమ్ఇండియా చీఫ్ సెలెక్టర్‌నైతే.. ముంబయి ఇండియన్స్ యజమాని ముఖేశ్ అంబానీతో.. బుమ్రా విషయమై మాట్లాడి ఉండేవాణ్ని. ఇంగ్లాండ్ సిరీస్ కారణంగా బుమ్రా.. ఐపీఎల్‌లో ఆడలేదని, లేకపోతే చాలా తక్కువ మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని చెప్పి ఒప్పించేవాణ్ని. నాకు తెలిసి నా ప్రతిపాదనకు వారు అంగీకరించేవారు' అని వెంగ్‌సర్కార్ అన్నాడు.

అలాగే ఈ విషయంలో ఆయన బుమ్రాకు మద్దతుగా నిలిచాడు. 'ఈ సిరీస్‌లో తక్కువ మ్యాచ్‌లు ఆడినందుకు మనం బుమ్రాను నిందించలేం. ఎందుకంటే అతడి వెన్నుకు శస్త్రచికిత్స జరిగింది. దేశంపై అతడికున్న నిబద్ధతనూ మనం ప్రశ్నించలేం. అతడు భారతజట్టుకు ఆడిన ప్రతిసారీ తన బెస్ట్ ఇచ్చే ప్రయత్నం చేస్తాడు. విశ్రాంతి తర్వాత బుమ్రా పూర్తి ఫిట్‌గా తిరిగి వస్తాడని ఆశిస్తున్నా' అని దిలీప్ వెంగ్‌సర్కార్ పేర్కొన్నాడు.

**'టీమ్ఇండియా ప్రధాన్ కోచ్‌గా గంభీర్‌కు ఆ హక్కు ఉంది'**

అలాగే ఓవల్ పిచ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్, టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్‌కు మధ్య అయిదో టెస్ట్ మ్యాచ్‌కు ముందు వివాదం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మ్యాథ్యూ హెడెన్.. గంభీర్‌ను తప్పుబడుతూ స్పందించాడు. గౌతమ్ గంభీర్ మరింత మెరుగైన భాష వాడి ఉండాల్సిందని అన్నాడు. ఈ విషయంలో దిలీప్ వెంగ్‌సర్కార్.. గౌతమ్ గంభీర్‌కు తన పూర్తి మద్దతు తెలిపాడు.

'టీమ్ఇండియా ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్‌కు పిచ్‌ను పరిశీలించే హక్కు కచ్చితంగా ఉంది. భారత్‌లో గనక ఇతర దేశాల జట్లు పర్యటిస్తే.. వారి కెప్టెన్లు, కోచ్‌లు మాత్రమే కాదు.. జట్టు మొత్తం పిచ్‌ను పరిశీలిస్తుంది. అంతెందుకు ఆయా దేశాల మీడియాలు కూడా మ్యాచ్‌కు ముందు పిచ్‌ను తనిఖీ చేస్తాయి. అప్పుడు వారికి ఎవరూ ఎలాంటి అభ్యంతరం తెలపరు. మరి మేం ఇంగ్లాండ్‌లో ఆడుతున్నప్పుడు రూల్స్ ఎలా మారతాయి?' అని వెంగ్‌సర్కార్.. మ్యాథ్యూ హెడెన్‌కు చురకలంటించారు. బుమ్రా అన్ని మ్యాచ్‌లూ ఆడి ఉంటే.. టీమ్ఇండియా తప్పకుండా సిరీస్ గెలిచేది: వెంగ్‌సర్కార్

# 2006 తర్వాత...

**ఆసియ కప్ అండర్– 20 ఫుట్‌బాల్ టోర్నీకి భారత మహిళల జట్టు అర్హత**

**క్వాలిఫయింగ్ టోర్నీలో అజేయంగా అగ్రస్థానం**



**యాంగాన్ (మయన్మార్):** భారత సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టుతో స్ఫూర్తి పొందిన భారత జూనియర్ మహిళల జట్టు అద్భుతం చేసింది. 2006 తర్వాత ఆసియా కప్ అండర్-20 మహిళల టోర్నీకి అర్హత సాధించింది. ఆదివారం ముగిసిన క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు అజేయంగా నిలిచి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. నాలుగు జట్లు పోటీపడ్డ గ్రూప్ 'డి'లో టీమిండియా రెండు విజయాలు, ఒక 'డ్రా'తో ఏడు పాయింట్లు సాధించి టాపర్‌గా నిలిచి ఆసియా కప్ బెర్త్‌ను సంపాదించింది. 2026 ఆసియా కప్ అండర్-20 టోర్నీ థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ 1 నుంచి 18వ తేదీ వరకు జరుగుతుంది.

గ్రూప్ 'డి'లో భాగంగా మయన్మార్ జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 27వ నిమిషంలో పూజ చేసిన గోల్‌తో ఖాతా తెరిచిన టీమిండియా నిర్ణీత సమయం పూర్తయ్యే వరకు ఈ ఆధిక్యాన్ని నిలబెట్టుకొని విజయాన్ని అందుకుంది. తొలి అర్ధభాగంలో భారత్ ఆధిపత్యం చలాయించగా... రెండో అర్ధభాగంలో మయన్మార్ ఆకట్టుకుంది. నేహా, షిబాని దేవి సమన్వయంతో ముందుకు దూసుకెళ్లడంతో ఆట మూడో నిమిషంలో భారత్ గోల్ చేసినంత పని చేసింది.

మరోవైపు మయన్మార్ ఫార్వర్డ్ సు సు ఖిన్ తొమ్మిదో నిమిషంలో ఎదురుదాడికి దిగినా ఫినిషింగ్ లోపంతో గోల్ చేయలేకపోయింది. 27వ నిమిషంలో కుడి వైపు నుంచి మయన్మార్ గోల్ పోస్ట్ వైపునకు దూసుకెళ్లిన పూజ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ బోణీ కొట్టింది. రెండో అర్ధభాగంలో మాత్రం సొంత ప్రేక్షకులు ఉత్సాహపరుస్తుండగా మయన్మార్ తమ దాడుల్లో పదును పెంచింది. పలుమార్లు భారత గోల్‌పోస్ట్ వైపు దూసుకొచ్చింది.

కానీ టీమిండియా గోల్‌కీపర్ మోనాలీసా దేవి సదా అప్రమత్తంగా ఉంటూ మయన్మార్ జట్టు ఆశలను వమ్ము చేసింది. ఈ మ్యాచ్‌కంటే ముందు భారత్... ఇండోనేసియాతో మ్యాచ్‌ను 0-0తో 'డ్రా' చేసుకొని ... తుర్క్‌మెనిస్తాన్ జట్టుపై 7-0తో గెలిచింది. చివరిసారి భారత జట్టు 2006లో జరిగిన ఆసియా కప్ అండర్-20 టోర్నీలో పోటీపడి ఒక్క మ్యాచ్‌లోనూ నెగ్గకుండానే లీగ్ దశలోనే వెనుదిరిగింది.

**25 వేల డాలర్ల నజరానా**

రెండు దశాబ్దాల తర్వాత ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించిన భారత మహిళల జట్టుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) నజరానా ప్రకటించింది. జట్టు మొత్తానికి 25 వేల డాలర్లు (రూ. 21 లక్షల 88 వేలు) అందజేస్తామని తెలిపింది.